ప్రజాశక్తి

గురువారం 26 డిసెంబర్ 2024 5 విజయనగరం



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 22 నుండి 24 వరకు తూర్పుగోదావరి జిల్లా రావుల పాలెంలో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ అంతర్ జిల్లాల బాల, బాలికల కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీల్లో విజయనగరం బాల బాలికల జట్లు ద్వితీయ స్థానం సాధించాయి. వీరి విజయం సాధించడం పట్ల జిల్లా కబడ్డీ సంఘ చైర్మన్ ఐవిపి రాజు, అధ్యక్షులు రంగారావు దొర , కార్యదర్శి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు, ట్రెజరర్ శివకుమార్ సంఘ సభ్యులు అందరూ కూడా హర్షం వ్యక్తం చేశారు.

రన్నర్ ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలుర జట్టు

ఆశలు.. అడియాసలు

- వరి పంటంతా నీటిపాలు
- మొలకెత్తిన ధాన్యం.. అపరాలకూ తీవ్ర నష్టం
- లబోదిబోమంటున్న రైతులు
- పంటను కాపాడుకునేందుకు అవస్థలు

పోలిపల్లి వద్ద నీటిలో ఉన్న వరి చేనును ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేస్తున్న రైతు

మొలకలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-విజయనగరం కోట/గజపతినగరం

జిల్లాలో ఈ నెల 17న ప్రారంభమైన వర్షాలు నేటికీ కొనసాగుతున్నాయి. దీంతో పొలాల్లో కోసి ఉంచిన వరిపనలు, వరి కుప్పలు పూర్తిగా తడిచిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. 8రోజులుగా కురుస్తున్న వర్షానికి కుప్పలు తడిచిపోయి ధాన్యం మొలకెత్తాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. విజయనగరం మండలంలో సుమారు 3500 ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగైంది. పలుచోట్ల పంట నూర్చి ధాన్యాన్ని విక్రయించగా చాలా చోట్ల ఇంకా దిబ్బలుగాను, పొలాల్లో ఓవులుగాను ఉంది. కోరుకొండ, కోరుకొండ పాలెం, పినవేమిలి గ్రామాల్లో ఎక్కువ శాతం పల్లపు భూములు కావడంతో సుమారు వెయ్యి ఎకరాలు పంట నీట మునిగినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎక్కువ భాగం చెరువు కింద ఉండడంతో చెరువులు నిండిపోయి వరిచేలపైనుంచి ప్రవహిస్తోంది. కోరుకొండ పాలెంలో జామినాయుడు చెరువు నీరు మరోవైపు వెళ్లే అవకాశం లేక పొలాలపైనుంచే పారుతోంది. బుడ్డిగెడ్డ ఆయకట్టు పరిస్థితి కూడా ఇంతే అని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట మొత్తం తడిచిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గజపతినగరం మండలంలో పురిటిపెంట, గంగచోళ్లపెంట, కొత్తబగ్గాం, పాత బగ్గాం, ముచ్చర్ల, కెంగువ తదితర గ్రామాల్లో రైతులు పూర్తిగా వరి పంట నష్టపోయారు. 30శాతం మంది రైతులు పంట నూర్చి ధాన్యాన్ని విక్రయించగా, 70శాతం మంది రైతులు ఇంకా వరిచేలను పొలాల్లోనూ గాలిదిబ్బలు రూపంలో ఉంచారు. వర్షాలకు దిబ్బలు పూర్తిగా తడిచిపోయి మొలకెత్తాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కనీసం ఆర బెట్టుకునేందుకు కూడా వర్షం తెరిపివ్వడం లేదని అంటున్నారు.

ఆరుగాలం కష్టించి.. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి చేతికొచ్చిన వరిపంట ఆఖరి దశలో నీటిపాలవ్వడంతో రైతుల ఏడాది ఆశలూ అడియాశలయ్యాయి. వరిచేలను నూర్పిడి చేసి విక్రయించి సంక్రాంతి పండగకు ఇంటిల్లపాదికి కొత్తబట్టలు కొనుక్కుందానుకున్న రైతులకు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. అల్పపీడన ప్రభావంతో వరుసగా కురుస్తున్న వర్షాలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పొలాల్లో కోసి ఉంచిన వరి పనలు పూర్తిగా నీటమునగగా, పొలాల్లో పెట్టి ఉంచి గాలిదిబ్బలు కూడా తడిచిపోయి పూర్తిగామొలకెత్తాయి. మరికొన్నిచోట్ల కుళ్లిపోయాయి. వాటిని ఆరబెట్టుకుందానుకున్నా వర్షం తెరిపి ఇవ్వకపోవడం, ఎండ కాయకపోవడంతో రైతులు పూర్తిగా ఈ ఏడాది పంటపై ఆశలు వదులుకుంటున్నారు.

పంటను కాపాడుకునేందుకు..

భోగాపురం : వర్షాలకు మండలంలోని వరి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కోత కోసే సమయానికి వర్షం ప్రారంభం కావడంతో పొలాల్లోనే వరి చేను ఉండిపోయింది. దీంతో ఆ పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పోలిపల్లి లింగాలవలస గ్రామాలకు చెందిన పంటలను ఎక్కువ స్థాయిలో నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

చేనంతా నీటి పాలైంది

కష్టపడి పండించిన పంట మొత్తం నీటిపాలైంది. చేతికి అంది వస్తుందనుకున్న పంట నిండా మునిగి భూమి పాలైంది. ఏ ఒక్కరూ ఇంకా కళ్లాలకు కూడా ఇంకా వరిచేలు తీసుకెళ్లలేదు. పొలాల్లో ఉన్న గాలి కుప్పల వరిచేలకు పూర్తిగా తడిచిపోయి మొలకెత్తాయి. పొలాలు మోకాలు లోతున నీరు ఉంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

-బోని రామకృష్ణ, కోరుకొండ పాలెం, విజయనగరం

ప్రభుత్వమే ఆదుకోవాలి

గ్రామంలో ఎక్కువ శాతం పల్లపు భూములే. పైన చెరువులు ఉండడంతో ఆ చెరువుకు ఒకవైపే తప్ప మరోవైపు నీరు పోవడానికి అవకాశం లేదు. దీంతో నిండిపోయిన నీరంతా పొలాలపైకి వచ్చి వరి చేలు నీట మునిగాయి. వరితో పాటు అపరాలు మొక్కలు కూడా కుళ్లిపోయి పోయాయి. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. పంట కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి.

- సిరిపురపు రమణ, కోరుకొండ పాలెం, విజయనగరం

రిజర్వాయర్లకు జలకళ

తాటిపూడి రిజర్వాయర్ నుంచి ఒక గేటు తెరిచి విడుదల చేస్తున్న నీరు

విజయనగరం : గత పది రోజులుగా అల్ప పీడన ప్రభావాలతో జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువులు, ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిండిపోయాయి. తాటిపూడి రిజర్వాయరులో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరింది. రిజర్వాయరు పూర్తి స్ధాయి మట్టం 297 అడుగులు కాగా, ప్రస్తుతం 295.40 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 450 క్యూసెక్కులు కాగా, ఒక గేటు ఎత్తివేసి 350 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. గోస్తనీ నదిలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున ప్రాజెక్టు దిగువన వున్న గంట్యాడ, జామి, ఎస్.కోట మండలాల్లోని నదీ తీరా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్ర ప్రాజెక్టు నీటి మట్టం పూర్తిసామర్థ్యం 146మీటర్లు కాగా, ప్రస్తుతం 143.15మీటర్లు నీరు ఉంది. ఇన్‌ఫ్లో 150 క్యూసెక్కులు వస్తోంది. 25 క్యూసెక్కుల నీటికి దిగువకు విడిచిపెడుతున్నారు.

మడ్డువలస ప్రాజెక్టులో 65మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కాగా, ప్రస్తుతం 64 మీటర్లకు చేరుకుంది.

- మడ్డువలస రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం 65మీటర్లు కాగా, ప్రస్తుతం 64మీటర్లకు చేరింది.
- వెంగళరాయ సాగర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం 161మీటర్లు కాగా, ప్రస్తుతం 160.40మీటర్లకు చేరింది.
- వట్టిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం పూర్తిస్థాయి సామర్థ్యం 121.62మీటర్లు కాగా, ప్రస్తుతం 111.31మీటర్లకు చేరింది.

చేతికొచ్చిన పంట నీటిపాలు

వంగర : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న, వరి, అపరాల పంటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దివలస, కొత్తవలస, కొప్పరవలస, ఎం.సీతారాంపురం గ్రామాల్లో వరిచేను కోత కోసి పొలాల్లో దిబ్బలుగా పెట్టారు. శివ్వాం, వంగర, తలగాం, కింజంగి, మరువాడ, ఓని అగ్రహారం గ్రామాల్లో ఇటీవల మొక్కజొన్న విత్తనాలు నాటారు. అకాల వర్షాలతో పొలాల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో వరి, మొక్కజొన్న పంటలు నాశనమయ్యే అవకాశం ఉంది. చేతికొచ్చిన వరిపంట నీటిపాలైందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మొక్కజొన్నకు ఎకరాకు సుమారు రూ.7 వేల వరకు పెట్టుబడి పెంటామని, ఆదిలోనే నష్టం పాలయ్యామని రైతులు వాపోతున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

వరిచేను కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

అపరాలకు అపార నష్టం

వేపాడ : మండలంలో పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అపరాల పంటలకు అపారనష్టం వాటిల్లింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పొలంలో నీరు చేరి, పంటంతా నీటిలో పూర్తిగా మునిగి ఉంది. వర్షపునీరు బయటకు పోయే అవకాశం లేకపోవడంతో అపరాల మొక్కలు చనిపోయే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

నీట మునిగిన పెసర చేను

తడిసిముద్దయిన వరికుప్పలు

బొబ్బిలి : అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు పొలాల్లో ఉన్న వరికుప్పలు తడిసి ముద్దయ్యాయి. ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో పొలాల్లో ఉన్న వరికుప్పలు పూర్తిగా నానిపోయాయి. కుప్పలు పైపొర, కిందపొర తడిసి ధాన్యం మొలకెత్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరాల పొలాల్లో నీరు చేరడంతో పెసర, మినుము పంటకు నష్టం వాటిల్లింది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వర్షాలకు నానిపోతున్న వరికుప్పలు

నీట మునిగిన పంటను పరిశీలించిన ఎమ్మెల్యే

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రాజాం : మండల పరిధిలో గల ఒమ్మి, గుయ్యానవలస గ్రామంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పెసర, మినువులు పంటలను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట మునిగిన పంట నష్టంపై తనకు నివేదిక ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఇప్పటికే ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు దృష్టిలో పెట్టామని, రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం రాజాం ఆర్‌సియం చర్చి వేడుకల్లో పాల్గొని రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకు అతీతంగా క్రిస్టమస్ పండుగలు నిర్వహించుకోవడం మంచి సంప్రదాయమని, ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచానికి ఒక మంచి మార్గమని అన్నారు.

అల్లకల్లోలంగా సముద్రం

భోగాపురం : అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీరంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు తీరంలో మెరైన్ పోలీసులు మత్స్యకారులను అప్రమత్తం చేస్తూ గస్తీ కాస్తున్నారు.

చేపలకంచేరు తీరంలో అల్లకల్లోలంగా ఉన్న సముద్రం

ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఎం

నెల్లిమర్ల : వరి పంట నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో గత 10 రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిపంట పూర్తిగా నాశనమైందని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరిపొలాల్లో ధాన్యం మొలకలు వచ్చి పంట పోయిందని వాపోయారు. విత్తనం నాటిన దగ్గర నుంచి పంట కోతవరకు ఎకరానికి రూ.30 వేలు ఖర్చయిందని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి కనీసం తిండి గింజలు కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వరి రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నత్తే నయం

- పల్లెపండగ పనుల్లో తీవ్ర జాప్యం
- సంక్రాంతి పూర్తిచేయడం అనుమానమే

'మండల స్థాయి అధికారులంతా బాధ్యతాయుతంగా పనిచేసి, జిల్లాలో పల్లెపండుగ కింద మంజూరు చేసిన పనులను సంక్రాంతిలోగా పూర్తిచేయాలి. రహదారులు, కాలువలు, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం కేటాయించిన నిధులను సకాలంలో ఖర్చుచేసి ప్రగతి చూపించాలి. పనులు మంజూరై రెండు నెలలు కావస్తున్నా నేటికీ 50 శాతం పురోగతి లేదు. ఇదే తరహాలో చేస్తే సంక్రాంతి నాటికి జిల్లాలో పల్లెపండుగ పనులు పూర్తిచేయడం అసాధ్యం. పనుల నిర్వహణలో అలసత్వం చూపే అధికారులపై చర్యలకు వెనకాడబోం.'

- పల్లెపండగ పనులపై ఇటీవల మండలాల వారీగా నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ వ్యాఖ్యలివి. రెండు నెలల్లో చేయని పనులు.. 18 రోజుల్లోగా ఎలా పూర్తిచేస్తారన్నది సంశయమే. ఎక్కడికక్కడ పనులు నత్తనడకన సాగుతుండటమే అందుకు ప్రధాన కారణం. అందుకేనేమో అధికారుల తీరుపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

గొంగాడవలసలో వేస్తున్న పల్లెపండగ రోడ్డు (ఫైల్)

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మీ పని ఎంతవరకు వచ్చింది? మీ పని ఎంతవరకు వచ్చింది? ఏ మేరకు పనులు ప్రారంభించారు? ఎన్ని పనులు పూర్తయ్యాయి?.. ఇదీ పల్లెపండగ పనులకు సంబంధించి కలెక్టర్ బిఆర్ అంబేద్కర్.. గత సోమవారం మండలాల వారీగా నిర్వహించిన సమీక్ష. పల్లెపండుగ కింద గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, మెటల్ రోడ్లు, పశువుల శాలలు నిర్మాణం జరుగుతున్న తీరుపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేయడానికి కారణం లేకపోలేదు. జిల్లాలో అక్టోబర్‌లో పల్లెపండగ పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. సంక్రాంతికి సొంతూళ్లకు ప్రజలు వచ్చే సమయానికి రోడ్లన్నీ పూర్తిచేయాలని నిర్దేశించారు. ఆ సమయంలోనే డిసెంబర్ 15వ తేదికి పనులు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్.. అధికారులకు స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. రెండు నెలలు గడిచినా పనుల్లో పురోగతి కనిపించలేదు. దీంతో సంక్రాంతికి పనులు పూర్తవుతాయా? అంటే కష్టమేనన్న సమాధానం సర్వత్రా వినిపిస్తోంది.

పనుల పరిస్థితిని పరిశీలిస్తే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంత రహదారులకు మహర్దశ కల్పించాలనే ఉద్దేశంతో పల్లెపండగ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అందుకోసం ఉపాధి హామీ నిధులు మంజూరు చేసింది. జిల్లాలో 191.34 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు నత్తనడకగానే పనులు సాగుతున్నాయి. జిల్లాలో 191.34 కిలోమీటర్లకు గాను ఇప్పటివరకు 55.82 కిలోమీటర్లు మాత్రమే పనులు జరిగాయి. బొబ్బిలి నియోజకవర్గంలో 392 పనులకు గాను 36.191 కిలోమీటర్లకు రూ.24.65 కోట్లు మంజూరు కాగా, ఇందులో 141 పనులు పూర్తయ్యాయి. అందుకు గాను రూ.5.58 కోట్ల బిల్లులు చేశారు. అందులో బొబ్బిలిలో 38 పనులకు రూ.1.84 కోట్లు ఇచ్చారు. జిల్లాలో ఎక్కువ పనులు(37.97 శాతం)తో బొబ్బిలి ముందంజలో ఉంది. గజపతినగరం నియోజకవర్గంలో 109 పనులకు గాను 41, రాజాం నియోజకవర్గంలో 400 పనులకు గాను 100 పనులు పూర్తయ్యాయి. చీపురుపల్లిలో 260 పనులకు గాను 77 పనులు, నెల్లిమర్లలో 258 పనులకు గాను 41 పనులు, విజయనగరంలో 155 పనులకు గాను 16, శృంగవరపుకోట నియోజకవర్గంలో 435 పనులకు గాను 124 పనులు పూర్తయ్యాయి. రెండు నెలల్లో పూర్తి కాని పనులు 20 రోజుల్లో పూర్తవుతాయా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. సమయం లేనందున మిగిలిన పనులు మరో 18 రోజుల్లో పూర్తి చేస్తారా? లేదా మరికొంత సమయం తీసుకొంటారా? అన్నది వేచి చూడాలి.

ఎందుకు ఆలస్యమంటే?

పల్లెపండగ పనులు నత్తనడక సాగడానికి అనేక అనేక కారణాలు తెలుస్తోంది. కూటమిలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన నాయకులకు పనుల కేటాయింపులో వివాదాలు చోటు చేసుకున్నాయి. ఆ వివాదాలతో పనులు ప్రారంభించేందుకు చాలాచోట్ల జాప్యం తలెత్తింది. పనుల కేటాయింపులు కొలిక్కి వచ్చాకే ప్రారంభానికి నోచుకొన్నాయి. మరోవైపు ఒకే పంచాయతీలో ఒకటి కంటే ఎక్కువ పనులను అదే పంచాయతీకి చెందిన రాజకీయ ప్రతినిధికి అప్పజెప్పడం వల్ల జాప్యమ వుతున్నట్లు తెలిసింది. ముందు చేపట్టిన పని బిల్లు వచ్చిన తరువాత ఇంకో పనిని ప్రారంభించేందుకు ఆ ప్రతినిధి వేచి చూస్తుండటంతో పనులు నత్తనడకన జరుగుతున్నట్లు సమాచారం. పనులు సర్దుబాటు చేస్తే పనుల్లో వేగవంతం, పురోగతి కనిపిస్తాయనే వాదన వినిపిస్తోంది.

జమ్ములో ఐదుగురికి డయేరియా

అప్రమత్తమైన అధికారులు

ప్రజాశక్తి- గుర్ల

మండలంలోని జమ్ము గ్రామంలో ఐదుగురికి డయేరియా సోకడంతో మండల, జిల్లా యంత్రాంగం అప్రమత్తమయ్యారు. విషయం తెలుసుకున్న డిఎల్‌పిఒ మోహన్ రావు, చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి, డిఎంహెచ్ భాస్కరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఉమాశంకర్, తహశీల్దార్ ఆదిలక్ష్మి తదితర అధికారులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు సంబంధింత అధికారులు లను అప్రమత్తం చేశారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు తదితర వాటిపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డయేరియా సోకిన వారిలో వెంపటాపు శ్రీను, రామునాయుడు, నడిపల్లి సన్యాసప్పడు, జమ్ము సత్యనారాయణమ్మ, గొర్లె స్వామి నాయుడు, కొల్లూరు అనురాధ ఉన్నారు. వీరిలో నలుగురు చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రిలోను ఒకరు తెట్టంగి పిహెచ్‌సిలోను, మరుకొరు జిల్లా కేంద్రాస్పత్రిలోను చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరిలో కొందరికి డయేరియా అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు.

డయేరియా బాధితుల ఇళ్లను సందర్శిస్తున్న అధికారులు

పూసపాటిరేగ : చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు;

వేపాడలో క్రిస్మస్ వేడుకలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-పూసపాటిరేగ

మండలంలోని గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు, వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. పూసపాటిరేగ యుఆర్‌పిఇఎఫ్ చర్చిలో పాస్టర్ ఎం.జీవన్‌కుమార్, డబ్ల్యుఎంఇ చర్చిలో పాస్టర్ లూకా, కందివలస చర్చిలో పాస్టర్ పిజి రాఫేల్, పేరాపురంలో రాజేష్, వెంపడాంలో పాస్టర్ రాజు, పతివాడలో పాస్టర్ రాము, గుంపాంలో పాస్టర్ ఆనంద్... క్రీస్తు బోధనలు చేశారు. పూసపాటిరేగ చర్చిలో సర్పంచి టొంపల సీతారాం, గ్రామ పెద్దలు పిన్నింటి సన్యాసినాయుడు, మహంతి లక్ష్మణరావు, మహంతి జనార్ధనరావు, పిడిఎ ప్రసాద్, కోరాడ అరుణ్‌బాబు, కప్పల రామారావు తదితరులు పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

బొబ్బిలి : పట్టణంలోని సిబిఎం, ఆర్‌సిఎం, సెవెంత్ డే, లూథరన్, బాప్టిస్ట్, బేతేల్ చర్చిలలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. మహారాణి పేటలో గల లుదరన్ చర్చిలో జె సి రాజు ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్‌వేడుకలు జరిగాయి.పాస్టర్ జాన్ విక్టర్, చర్చి ప్రతినిధులు పివిఎ మెర్సీ బాయ్, డేవిడ్ జె విక్టర్, పెంకి రాజు, రమణ మాస్టర్. శేఖర్, రోటరీ అధ్యక్షులు సింధ్రీ శ్రీనివాసన్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీ హరి , చంద్ర కిషోర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంకోట : జిల్లా కేంద్రంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక అలంకరణలతో చర్చిలను ముస్తాబ్ చేశారు.లూథరన్, బాప్టిస్ట్, బేతేల్ చర్చిలలో క్రైస్తవులు ప్రార్ధనలు నిర్వహించారు.

వేపాడ : మండలంలోని అన్నిచర్చిల్లోనూ క్రిస్మస్ వేడుకలు జరిగాయి.

నేడు ఫెన్సింగ్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 28 నుంచి కాకినాడ జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక గురువారం విజ్జీ స్టేడియంలో మధ్యాహ్నం 3గంటలకు జరుగుతుందని అసోసియేషన్ కార్యదర్శి డివై ప్రసాద్ తెలిపారు. 2008 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 21లోపు పుట్టిన వారు అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ, వ్యక్తిగత ఫెనింగ్ ఎక్విప్‌మెంట్‌తో హాజరు కావాలని, వివరాలకు 7780393143 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

28 నుంచి అరకుకు ప్రత్యేక రైలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అరకు పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తూర్పు కోస్తా రైల్వే విశాఖ నుంచి ప్రత్యేక రైలు నడపనున్నట్లు వాల్తేరు సీనియర్ డిసిఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 28 నుంచి జనవరి 19వ తేదీ వరకు ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 8.30 గంటలకు విశాఖలో బయలు దేరి ఉదయం 11.45 గంటలకు అరకు చేరుకోనున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో అదే రోజుల్లో మధ్యాహ్నం 2 గంటలకు బయలు దేరి సాయంత్రం 6 గంటలకు విశాఖ చేరుకోనున్నట్లు వెల్లడించారు. ఒక సెకెండ్ ఎసి, ఒక థర్డ్ ఎసి, 10 స్లీపర్ క్లాస్, 4 సాధారణ రెండో తరగతి, 2 సాధారణ కమ్ లగేజీ బోగీలతో ఈ రైలు సింహాచలం, కొత్తవలస, శృంగవరపుకోట, బొర్రా గుహలు మీదుగా రాకపోకలు సాగించనున్నట్లు వివరించారు. ఈ రైలు సేవలను పర్యాటకులు వినియోగించుకోవాలని కోరారు.

రైలు దిగి గ్రామాలకు వస్తున్న కార్మికులు

స్వగ్రామాలకు వలస కార్మికులు

ప్రజాశక్తి- బొబ్బిలి

భవన నిర్మాణ, వ్యవసాయ పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కార్మికులు సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం, బలిజిపేట, సీతానగరం, మక్కువ మండలాలకు చెందిన వ్యవసాయ కార్మికులు వరి కోతలకు ఉభయగోదావరి జిల్లాలతోపాటు గుంటూరు, కృష్ణా జిల్లాలకు వెళ్లారు. భవన నిర్మాణ కార్మికులు విజయవాడ, తెనాలి, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లారు. వారంతా సంక్రాంతి సమీపించడంతో సొంతూళ్లకు చేరుకుంటున్నారు. దీంతో రైల్వేస్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ వలస కార్మికులతో కిటకిటలాడుతున్నాయి.

జోరువానలో కొనసాగిన నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం

వారంరోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షంలోనూ గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు దీక్షలు కొనసాగించారు. ఉపాధ్యాయులు ఇందిరా కుమారి, దీవరాజ్, కామేష్, శివ, శంకర్ రావు, రంగారావు, మురళీ, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్ కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల విషయంలో కుంభ కర్ణ నిద్రలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. . ఇప్పటికైనా నిద్ర వీడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గిరిజన విద్య, మిథ్యగా మారుతోందని తెలిపారు.

కబడ్డీలో సత్తాచాటిన నీలిమ, వినయ్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణానికి చెందిన బుత్తల నీలిమ, మండలంలోని పెదకందేపల్లి గ్రామానికి చెందిన వినయ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తాచాటారు. గజపతినగరంలోని రావి స్వరాజ్యం మెమోరియల్ కబడ్డీ క్లబ్ ద్వారా వారు శిక్షణ పొందారు. రావులపాలెంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించారు. బాలికల విభాగంలో నీలిమ, బాలుర విభాగంలో వినయ్ ద్వితీయ స్థానాలు సాధించారని కోచ్ అల్లి తాతబాబు తెలిపారు. వీరిని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవిపి రాజు, అధ్యక్షులు రంగారావు, కార్యదర్శి ప్రభావతి, రావి స్వరాజ్యం మెమోరియల్ కబడ్డీ క్లబ్ చైర్మన్ రావి శ్రీధర్, కబడ్డీ కోచ్ అల్లి తాతబాబు అభినందనలు తెలియజేశారు.

అథ్లెటిక్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆలిండియా యూనివర్సిటీ అథ్లెటిక్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. వారిలో విజయనగరం ప్రభుత్వ డిగ్రీకళాశాలకి చెందిన పి.వసంత 100, 200 మీటర్లు, ఎంఆర్ కళాశాలకు చెందిన ఎస్.శ్రావణి 200,400 మీటర్లు శ్రీనివాస కళాశాలకు చెందిన వి.భార్గవి 100 మీటర్లు, సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.హరీష్ 5వేలు, 10వేలు మీటర్లలో ఎంపికయ్యారు. వీరిని జిల్లా అథ్లెటిక్స్ సంఘ సభ్యులు అభినందించారు.

జాతీయ పోటీల్లో సాలూరు విద్యార్థికి మెడల్

ప్రజాశక్తి - సాలూరురూరల్

జాతీయ స్థాయి సబ్ జూనియర్ క్రీడా పోటీల్లో స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి నితిన్ సాయి మనోహర్ బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈనెల 19 నుంచి 24 వరకు కాశ్మీర్‌లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున నితిన్ సాయి మనోహర్ పాల్గొన్నాడు. సాఫ్ట్ బాల్‌లో ఆయన పతకం సాధించడంపై గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఆశీర్వాదం, పిడి విద్యాసాగర్, పిఇటి నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

27న టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో మేళా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27న నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ఓపెన్ ఫారం కార్యక్రమంతో పాటు ఎల్ఆర్ఎస్, బిల్డింగ్ షార్ట్ ఫాల్ ధరఖాస్తుల ఆమోదానికి ప్రత్యేక మేళాను నిర్వహించనున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ మేళాలో అక్కడికక్కడే ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రణాళిక విభాగం తరపున అవసరమైన అన్ని అనుమతులనూ మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

రాయితీపై అందుబాటులో ఆనందగజపతి ఆడిటోరియం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో పలు కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కొన్ని సంస్థలకు రాయితీ ద్వారా అందించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆనంద గజపతి ఆడిటోరియం ప్రస్తుతం నగరపాలక సంస్థ అదీనంలోకి వచ్చిందని తెలిపారు. క్రీడా, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించా లన్న ఉద్దేశంతో ఆనంద గజపతి ఆడిటోరియంను వినియోగించుకునేందుకు రాయితీ ద్వారా అందించాలన్న విషయమై కౌన్సిల్ దృష్టికి తేగా, ఆయా సంస్థలకు 50 శాతం రాయితీ ద్వారా ఇప్పించాలని కౌన్సిల్ తీర్మానించిందని తెలిపారు. ఆడిటోరియాన్ని ప్రైవేటు కార్యక్రమాల నిమిత్తం వినియోగించుకునే పరిస్థితుల్లో రోజుకు రూ.30 వేలు చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడ, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు కోసం వినియోగించుకునే నిమిత్తం రోజుకు రూ.15వేలు ధరకే రాయితీగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

తగ్గిన ట్రేడ్ లైసెన్స్ ధరలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్సులు పొందే విషయంలో గణనీయమైన తగ్గింపు ధరలకు కౌన్సిల్ ఆమోదించిందని కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్, వివిధ వాణిజ్య సంస్థలు అభ్యర్థన మేరకు ట్రేడ్ లైసెన్సులను తగ్గించే విషయమే కౌన్సిల్ దృష్టికి తేగా గణనీయంగా ట్రేడ్ లైసెన్స్ ధరలను తగ్గించేందుకు కౌన్సిల్ ఆమోదించిందని తెలిపారు. వాస్తవానికి వ్యాపారం ప్రారంభించే సమయాని కన్నా 90 రోజులు ముందుగా ట్రేడ్ లైసెన్సులను పొందాలని అన్నారు. ఇంకా ట్రేడ్ లైసెన్సులు పొందలేని వారు తక్షణమే లైసెన్సు ధరలను చెల్లించి అనుమతులను పొందాలని సూచించారు. ఇప్పటికే లైసెన్సులు పొందిన వారు బకాయి పడ్డ రెన్యువల్ మొత్తాలను చెల్లించాలని కోరారు.

ఉద్యోగోన్నతుల పట్ల హర్షం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్లకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉద్యోగోన్నతులు కల్పించడం పట్ల ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు డాక్టర్ ఎం. హనుమంతరావు, ఎస్.శ్రీనివాసరావులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వ్యవస్థను బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కొత్త ప్రిన్సిపాళ్ళు ప్రభుత్వానికి తెలియజేశారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కు, రాష్ట్ర సూక్ష్మ, చిన్నమరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-బొబ్బిలి

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి స్ఫూర్తితో పట్టణ, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. వాజపేయి శత జయంతి సందర్భంగా నివాళులర్పించారు. సుపరిపాలనతో దేశ ప్రగతిని కొత్త పుంతలు తొక్కించిన మహనీయులు వాజపేయి అని కొనియాడారు.

ఫైబర్‌నెట్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో వెలుగు చూసిన ఫైబర్ నెట్ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన మండల అధ్యక్షులు ఎస్.గంగాధర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వైసిపి హయాంలో అర్హత, నియామక పత్రాలు లేకపోయినా అడ్డగోలుగా ఫైబర్ నెట్‌లో నియామకాలు చేపట్టారని తెలిపారు. ఫైబర్‌నెట్‌లో నియమించిన ఉద్యోగులతో మంత్రులు ఇళ్ల పనులు చేయించుకోవడం అన్యాయమని, వైసిపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఫైబర్‌నెట్ అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేడు కొంపల్లిలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొంపల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జె.రాములమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో రైతులు తమ భూ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు. భూసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న సదస్సును వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

భారీ వాహనాల రాకపోకలతో అధ్వానంగా మారిన కంచేరు రహదారి

కాలినడకన కూడా వెళ్లేందుకు అవకాశం లేని సిమ్మపేట జగనన్న కాలనీ

బురదమయంగా మారిన జమ్మయ్యపేట రహదారి

అధ్వానంగా రహదారులు

ప్రజాశక్తి-భోగాపురం

అల్పపీడనం కారణంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. బురదమయం కావడంతో కాలు తీసి కాలు వేసేందుకు కూడా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా భోగాపురం పంచాయతీ సిమ్మపేట జగనన్న కాలనీలో నడిచి వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. జాతీయ రహదారి నుంచి చేపలకంచేరు వెళ్లే తారురోడ్డు మట్టి రోడ్డుగా మారిపోయింది. గూడెపువలస నుంచి రెడ్డికంచేరు వరకు వెళ్లే వాహనదారులు ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గూడెపువలసలో మరి దారుణంగా తయారైంది. ప్రధానంగా ఈ రహదారిలో విమానాశ్రయానికి సంబంధించిన భారీ వాహనాలు వెళ్లడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. విమానాశ్రయ ప్రహరీ నుంచి జమ్మయ్యపేట వెళ్లే రహదారి బురదమయం కావడంతో రాకపోకలకు పూర్తిగా ఆటంకం ఏర్పడింది.

ప్రయాణం నరకయాతన

సంతకవిటి : మండల కేంద్రం సంతకవిటి నుంచి కొండగూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వర్షాలతో అధ్వానంగా తయారైంది. సంతకవిటి నుంచి శ్రీహరినాయుడుపేట, కృష్ణంవలస, కొండగూడెం మీదుగా పాలకొండకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. ఈ రహదారికి 30 ఏళ్లు గడిచినప్పటికీ ఇంతవరకు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. గుంతల రహదారి మీదుగా ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

అధ్వానంగా తయారైన రోడ్డు

రోడ్డంతా గుంతలే

వంగర : మండలంలోని భాగెంపేట నుంచి నీలయ్యవలస మీదుగా కొండవలస సెంటర్ వరకు ఉన్న రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడింది. సుమారు పది గ్రామాలకు వెళ్లే రోడ్డంతా అధ్వానంగా తయారైంది. రోడ్డు దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు బుధవారం రోడ్డు బాగుచేయాలని డ్రోన్ ద్వారా ప్లకార్డు ప్రదర్శించి, నిరసన తెలిపారు.

కొండవలస జంక్షన్ నుంచి భాగెంపేటకు రోడ్డు వేయాలని డ్రోన్ ద్వారా ప్రదర్శిస్తున్న ప్లకార్డు

శ్మశానవాటికలకు రహదారుల నిర్మాణం

పనులను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ పి.గౌరునాయుడు, నాయకులు

ప్రజాశక్తి- విజయనగరం కోట

విజయనగరం మండలంలోని కొండకరకాం గ్రామంలో శ్మశాన వాటికలకు రహదారుల నిర్మాణమే ప్రధాన ఎజెండా అని కొండకరకాం మాజీ సర్పంచ్ పాండ్రంకి గౌరునాయుడు తెలిపారు. ఉపాధి హామీ నిధులతో గ్రామంలో మూడు శ్మశాన వాటికలకు రహదారులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గౌరమ్మ పంప్‌హౌస్ నుంచి కిలారి వీధి శ్మశానవాటికకు రూ.22 లక్షలతో 561 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కిలారివీధి శ్మశానవాటికకు రూ.11.3 లక్షలతో 280 మీటర్ల పొడవున రోడ్డు, భోగారపువీధి శ్మశానవాటికకు రూ.4.5 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కొండవెలగాడ, కొండకరకాం మధ్యలో రూ.13.50 లక్షలతో 35 మీటర్ల సిసి రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కొండపల్లి రమణ ఇంటి దగ్గర నుంచి రెండు వైపులా కాలువలను రూ.3.92 లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. శివాలయం నుంచి పోతయ్యబంద వరకు రూ.2.45 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా సిసి కాలువలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కనకరాజు ఇంటి దగ్గర నుంచి దేవర చెట్టు వరకు రూ.2.50 లక్షలతో 55 మీటర్ల మేర సిసి రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. మంచాల పుడయ్య ఇంటి దగ్గర నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు రూ.11.25 లక్షలతో సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు వివరించారు. గ్రామంలో మొత్తం ఎనిమిది అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనులను ఆయనతోపాటు ఎంపిటిసి మాజీ సభ్యులు రాంబార్కి రామునాయుడు, టిడిపి నాయకులు కిలారి సూర్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

సిసి కాలువ పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు చొప్ప రామారావు, తదితరులు

కోరుకొండపాలెంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం మండలంలోని కోరుకొండపాలెం గ్రామంలో 42 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు టిడిపి నాయకులు చొప్ప రామారావు తెలిపారు. ఉపాధి హామీ నిధులతో గ్రామంలో ఆరు కాలువలు, నాలుగు సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 789 మీటర్ల పొడవు మేర డ్రెయిన్లు, 170 మీటర్ల పొడవు మేర సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టకపోవడంతో అధ్వానంగా ఉండేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపాధి హామీ నిధులతో గ్రామంలో వీధి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో రూపురేఖలు మారుతాయని వివరించారు. అంతేకాకుండా గ్రామంలో సగానికి పైగా డ్రెయిన్లను చెరువుకు అనుసంధానం చేయడం వల్ల మురుగునీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

నిధులున్నా.. అభివృద్ధి సున్నా

బురదమయమైన కూరగాయల మార్కెట్ ఆవరణం

ప్రజాశక్తి - రామభద్రపురం

అంతర్జాతీయ మార్కెట్‌గా పేరొందిన రామభద్రపురంలోని కూరగాయల మార్కెట్లో నిధులున్నా.. అభివృద్ధి సున్నా అన్న చందంగా మారింది. చిన్నపాటి వర్షానికే మార్కెట్ మొత్తం బురదమయం అవుతోంది. అమ్మకాలు, కొనుగోళ్లకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అటు రైతులు, ఇటు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్కెట్‌కు ఏటా ఆశీల రూపంలో లక్షలాది రూపాయలు ఆదాయం సమకూరుతోంది. కానీ, వసతుల కల్పనలో రిక్త హస్తం చూపిస్తున్న అధికార యంత్రాంగం తీరుపై రైతన్నలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మార్కెట్ మొత్తం బురదమయమైంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ గొడుగు నీడలోనే ఉంటూ కూరగాయలు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి వసతులు సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.

అధ్యక్షులుగా ఎన్నికైన ప్రసాదరావును సన్మానిస్తున్న సభ్యులు

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులుగా ప్రసాదరావు

ప్రజాశక్తి-కొత్తవలస

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కొత్తవలస తాలూకా అధ్యక్షులుగా జెవి ప్రసాదరావు ఎన్నికయ్యారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రామలక్ష్మణ్ అధ్యక్షతన బుధవారం ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ మాట్లాడుతూ జిఒ 1207 ద్వారా నియమించిన కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను ఇటీవల తొలగించడం బాధాకరమన్నారు. వారిని ప్రభుత్వం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఐఆర్ తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు సంఘటితంగా పనిచేసి సంఘాన్ని బలోపేతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా రమణను సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ తాలూకా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఈశ్వరరావు, సభ్యులు రమణమ్మ, సూరిదేముడు, రమణ, కళావతి, స్వర్ణ, భాగ్యలక్ష్మి, సత్యారావు, సూర్యారావు, కృష్ణంనాయుడు, శంకరరావు పాల్గొన్నారు.

టిడిపిలోకి బైరెడ్డి దంపతులు

ప్రజాశక్తి- నెల్లిమర్ల



టిడిపిలో చేరిన వారితో మాజీమంత్రి పతివాడ, ఇతర నాయకులు

నగర పంచాయతీలో వైసిపికి గట్టి షాక్ తగిలింది. వైసిపికి చెందిన బైరెడ్డి నాగేశ్వరరావు, లీలావతి దంపతులు, మహంతి రాంబాబు, కొక్కిరి మల్లేష్ పాటు సుమారు 50 కుటుంబాల వారు మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు సమక్షంలో బుధవారం టిడిపిలో చేరారు. అనంతరం మాజీ జిల్లా పరిషత్తు చైర్మన్ బైరెడ్డి సూర్యనారాయణ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, నియోజకవర్గ నాయకులు కంది చంద్రశేఖర్, మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు, రాష్ట్ర నాగవంశం కన్వీనర్ అవనాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సొమ్మసిల్లిన కార్మికుడు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని కొత్తవలసలో 9వ వార్డు పల్లెంవారివీధి జంక్షన్ వద్ద గల ఐరన్ ఎలక్ట్రికల్ స్తంభానికి విద్యుత్ ప్రసరించడంతో మున్సిపల్ ప్రజారోగ్య విభాగంలో ఆప్కాస్ విధానంలో పారిశుధ్య కార్మికునిగా విధులు నిర్వహిస్తున్న జలగడుగుల సత్తిరాజు షాక్‌కు గురై సొమ్మసిల్లిపోయాడు. బుధవారం అతడు అదే వార్డులో విధులు నిర్వహిస్తుండగా విద్యుత్ స్తంభానికి అనుకోకుండా తన కాలు తగలగానే కరెంట్ షాక్‌తో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

సమాచారం తెలుసుకున్న సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు ఆసుపత్రికి వెళ్లి సత్తిరాజును పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు సమ్మెలో భాగంగా గత ప్రభుత్వం విడుదల చేసిన జీవోలు కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. విధి నిర్వహణలో పారిశుధ్య కార్మికులకు ప్రమాదాలకు గురైతే ఎవరు రక్షణ కల్పిస్తారని, సత్తిరాజుకు నష్టపరిహారం సంబంధిత ఇవ్వాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని, ప్రమాదాలు జరగకుండా విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

పార్వతీపురం టౌన్ : బలిజిపేట పోలీసు స్టేషన్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వర్తించిన భూరి నారాయణస్వామి ఇటీవలే మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన భార్య భూరి శారదకు బుధవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐ కె.మురళీధర్, ఎస్ఐ ఎం.గోవింద సమక్షంలో వృద్ధ మిత్ర కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి రూ.5వేల నగదుతో పాటు బట్టలు అందజేశారు. దీంతో పాటు పట్టణంలోని పలువురు వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు రగ్గులు, స్టీలు గ్లాసులు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి ఉదారతను సిఐ, ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది కొనియాడారు.

కలెక్టర్ ఆదేశించినా చర్యలు తీసుకోరా?

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని వెలుగు ఎపిఎం, సిసిలపై చర్యలకు జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ అధికారుల్లో చలనం లేదని మండలంలోని రావికోన పంచాయితీ గిరిజన స్వయం సహాయక బృందం మహిళలు, స్థానిక గిరిజన సంఘ నాయకులు విమర్శించారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ బంగారమ్మ పొదుపు సంఘ సమావేశం ఏర్పాటు చేసి విఎఒను నియమించుకోవాల్సి ఉన్నప్పటికీ 8నెలలుగా గ్రామ సంఘ సమావేశం నిర్వహించకుండా సిసి, ఎపిఎం కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. వీరి చర్యలను గమనిస్తే రాజకీయ ఒత్తిళ్లకు లొంగి లాలూచీపడినట్లు కనబడుతుందని తెలిపారు. ఈ విషయమై సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే సంబంధించిన వారిపై చర్యలు తీసుకొని సమావేశం నిర్వహించి విఎఒను నియమించాలని ఆదేశించినప్పటికీ ఎపిడి ఈ విషయంలో తాత్సారం చేస్తున్నారని అన్నారు. ఒక గిరిజన పంచాయితీలో వేరొక పంచాయతీకి చెందిన గిరిజన కాని వారిని నియమించాలని సిసి ఎలా ఆలోచించారని అంటే చేతివాటం ఉందన్నది స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. అయినా కలెక్టర్ సిసిని సస్పెండ్ చేయమని చెప్పినా ఎపిడి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సబబు, ఇన్ని నెలలు ఎందుకు కాలయాపన చేస్తున్నారో అర్థం కావడంలేదని అన్నారు. ఇప్పటికైనా గ్రామ సంఘం సమావేశం ఏర్పాటు చేసుకొని విఎఒను నియమించాలని కోరుతున్నారు.

జెఎఫ్ఒల సంఘం జోనల్ కార్యదర్శిగా మనోజ్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జోనల్ సెక్రటరీగా మన్యం జిల్లా అటవీ శాఖలోని పార్వతీపురం సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మీసాల మనోజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన్ను ఎన్నుకోవడం జరిగింది.

CHANGE OF NAME

I, undersigned **GARAGA SUSRUTHA** (Old Name) W/o Garaga Varun MIG-10 Vuda colony, Phase IV, Vizianagaram-535003. A.P. Changing my Name from **GARAGA SUSRUTHA** (Old Name) to **GARAGA SAVITRI SUSRUTHA** (New Name) shall hence forth i am being called as **GARAGA SAVITRI SUSRUTHA** (New Name) W/o Garaga Varun for all purposes